న్యాయ పూర్తి వివరణ

న్యాయ పరిధి : ఇతరాలు
సెక్షన్ పరిధి : పోలీసు వ్యవహారాలు
ఉప సెక్షన్ పరిధి : బెయిల్ (జామీను)

## సంక్షిప్తంగా న్యాయ సమాచారం

బెయిల్ అనేది ముద్దాయికి వుండే హక్కు. జామీను మీద ముద్దాయి నిర్బంధం నుండి బటపడటమే బెయిలు. అరెస్ట్ చేసినప్పుడే పోలీసులు యీ హక్కు గురించి ముద్దాయికి తెలియజేయాలి. బెయిలు పొందటం వలన ముద్దాయి నిర్బంధం నుండి బయటపడి తన మీద వచ్చిన ఆరోపణలకి సంజాయిషీ చెప్పుకునేందుకు ఎర్పాట్లు చేసుకునే వీలు కలుగుతుంది.

## విపులంగా న్యాయ వివరాలు

1. బెయిలబుల్ నేరం : ఈ నేరం కింద పోలీసులు ముద్దాయిని అరెస్ట్ చేస్తే, పోలీసులు తప్పనిసరిగా జామీనుపై విడుదల చేయవలసి వుంటుంది. వ్యక్తిగత పూచీ లేదా మరొకరి పూచీకత్తుపై విడుదల చేయవచ్చు. ముద్దాయి తనకు తానుగా బెయిలుపై విడుదలయ్యేందుకు నిరాకరిస్తే తప్ప పోలీసులు జామీనుపై విడుదల చేయడానికి నిరాకరించే వీలులేదు. ఒకవేళ, ముద్దాయిని కోర్టుకు తీసుకు వచ్చినప్పుడైనా కోర్టు తప్పనిసరిగా బెయిలు మంజూరు చేయవలసి వుంటుంది భారత శిక్షాస్మృతి మొదటి షెడ్యూల్‌లో బెయిలబుల్ నేరాలుగా పేర్కొన్న నేరాలు కానీ మరి యితర చట్టంలోనైనా బెయిలబుల్ నేరాలుగా పేర్కొన్న నేరాలన్నింటికీ యీ నిబంధన వర్తిసుంది.
2. నాన్ బెయిలబుల్ నేరం : ఈ తరహా నేరాలలో బెయిల్ యివ్వాలా, వద్దా అనేది మేజిస్ట్రేట్ యిష్టాయిష్టాల మీద ఆధారపడి వుంటుంది. ముద్దాయికి తప్పనిసరిగా బెయిలు యివ్వాలని లేదు. ఉరిశిక్ష లేదా జీవితఖైదు విధించడానికి అవకాశం వున్న కేసుల్లో మాత్రం మేజిస్ట్రేట్ నిందితుడికి బెయిల్ యివ్వటానికి వీల్లేదు. ఇలాంటి కేసుల్లో బెయిలు యిచ్చే అధికారం సెషన్స్ జడ్జి, హైకోర్టు, సుప్రీం కోర్టులకు మాత్రం వుంటుంది.
3. పోలీసుస్టేషన్ అధికారి ముద్దాయిని బెయిల్ మీద విడుదల చేసేట్లయితే అతను కోర్టుకు ఎప్పుడురావలసి వుంటుందో తెలియజేయాలి. ముద్దాయి కోర్టులో హాజరువుతానని హామీని ఉల్లంఘించినట్లయితే కోర్టు అతని అరెస్ట్‌కు వారెంట్ జారీ చేస్తుంది. ముద్దాయి తప్పించుకుని పారిపోయే అవకాశం లేదని కోర్టు భావించినపుడు వ్యక్తిగత పూచీ మీద

విడుదల చేయవచ్చు. ఒకవేళ పూచీకత్తు కోరినప్పటికీ అతడికి అందుబాటులో వుండేస్థాయిలోనే పూచీకత్తును కోరవలసి వుంటుంది.

యాంటిసిపేటరీ బెయిలు:

నాన్ బెయిలబుల్ కేసుల్లో ముద్దాయికి అరెస్టయిన వెంటనే బెయిలు లభించదు. ఇలాంటి కేసుల్లో ముద్దాయిని అరెస్టయిన వెంటనే బెయిలు మీద విడుదల చేయమని యిచ్చే ఉత్తర్వులనే యాంటీసిపేటరీ బెయిల్ అంటారు. అంటే అరెస్ట్ కాక ముందే, అరెస్టయిన వెంటనే విడుదల చేయమనే ఉత్తర్వునే యాంటిసిపేటరీ బెయిలు అంటారు.

ఇది కేవలం నాన్ బెయిలబుల్ కేసులకు మాత్రమే వర్తిస్తుంది. యాంటిసిపెటరీ బెయిలును సెషన్స్ జడ్జి లేదా హైకోర్టులు మాత్రమే యివ్వగలవు. తీవ్రమైన నేరాల విషయంలో, యావజ్జీవ జైలు శిక్ష, మరణ శిక్షపడే అవకాశం వున్నకేసుల్లో కూడా యాంటిసిపేటరీ బెయిలు తీసుకోవచ్చు.

యాంటిసిపేటరీ బెయిలు యొక్క ముఖ్య ఉద్దేశం  ఒక వ్యక్తికి దర్యాప్తుకు ఆటంకం కలిగించే విధంగా పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కలుగజేయటం కాదు. యాంటిసుపేటరీ బెయిలు మంజూరు చేసేటప్పుడు కోర్టు, దర్యాప్తు నిరాటంకంగా కొనసాగటానికి కొన్ని నిబంధనలను విధించవచ్చు.

ఈ బెయిల్లో పోలీసులు కోరినప్పుడు హాజరు కావాలని కోర్టు నిందితుణ్ణి ఆదేశించవచ్చు. సాక్షి సాక్ష్యం చెప్పకుండా ముద్దాయిని నిరోధించకుండా నిబంధనలు పెట్టవచ్చు. విదేశాలకు వెళ్ళాలంటే కోర్టు అనుమతి తప్పదని యాంటిసిపేటరీ బెయిలు ఉత్తర్వులో పేర్కొనవచ్చు. అయితే యాంటిసిపేటరీ బెయిలు పొందిన వ్యక్తిని పోలీసులు ఇంటరాగేట్ చేయవచ్చు. అవసరమనుకుంటే ఆ వ్యక్తి ఇంటరాగేషన్ తన న్యాయవాది సమక్షంలో జరపాలని కోరవచ్చు. యాంటిసిపేటరీ బెయిలు మంజూరయినప్పుడు మధ్యలో అది క్యాన్సిల్ అయితే తప్ప అది కేసు విచారణ పూర్తయ్యేవరకు అమలులో వుంటుంది. ఒకవేళ దానిని రద్దుపరచాలంటే బెయిల్ యిచ్చిన కోర్టు కానీ, హై కోర్టుకు గానీ అధికారం వుంటుంది.

## పరిష్కార పద్ధతి

## సెక్షన్ పేరు

సెక్షన్ 436 - 450

## ఫిర్యాదు ఎవరికి ఇవ్వాలి / ఎక్కడ ఇవ్వాలి ?

బెయిలబుల్ కేసుల్లో పోలీసు అధికారి వద్ద బెయిల్ బాండ్ ఫైల్ చేయాలి.
నాన్-బెయిలబుల్ కేసుల్లో మెజిస్ట్రేటుకి దరఖాస్తు పెట్టవచ్చు, సెషన్స్ కోర్టుకు, హైకోర్టుకు కూడా బెయిల్ మంజూరుకు ప్రత్యేక అధికారాలు ఇవ్వబడినవి.
యాంటిసిపేటరీ బెయిలు కోసం సెషన్స్ కోర్టును అభ్యర్థించవచ్చు. ఆ కోర్టు దానిని నిరాకరించినట్లయితే హైకోర్టును అభ్యర్థించవచ్చు. లేదా నేరుగా హైకోర్టును అభ్యర్థించవచ్చు.
ఒకసారి బెయిలు అభ్యర్ధన నిరాకరణకు గురైందని ఆ ప్రయత్నం మానుకోవలసిన పనిలేదు.
ఎన్నిసార్లయిన యాంటిసిపేటరీ బెయిలుకు ప్రయత్నించవచ్చు.

## కేసు ఫైల్ చేయడం ఎలా ?

బెయిల్ ఫారమ్ తీసుకొని, జామీను మరియు ఇద్దరు వ్యక్తుల పూచీకత్తు మీద తనను విడుదల చేయమని దరఖాస్తు పెట్టాలి.
బెయిల్ ఫారంలో నింపవలసిన విషయాలు:

1. పేరు.
2. అడ్రస్సు
3. పోలీసు స్టేషన్ లేదా కోర్టు పేరు
4. జామీను మొత్తం
5. బెయిల్ నిబంధనలు

బెయిలు నిబంధనలు పాటించకపోతే, జామీను మొత్తమును ప్రభుత్వము జప్తు చేయగలదని కూడా రాసి ఉంటుంది.
బెయిల్ మంజూరుకు నిరాకరించినచో, సెక్షన్ 439 కింద సెషన్స్ కోర్టును లేదా హై కోర్టును ఆశ్రయించవచ్చు.

## తరువాత

1. బెయిల్ మీద విడుదల అయిన వ్యక్తి, పోలీసువారు పిలిచినప్పుడల్లా వెళ్ళాలి.
2. బెయిల్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.
3. నిబంధనలను ఉల్లంఘిస్తే, తర్వాత పెట్టుకున్న బెయిల్ దరఖాస్తు నిరాకరించబడుతుంది.
4. పోలీసువారు బెయిల్ ఇచ్చినట్లయితే, తిరిగి కోర్టుకు దరఖాస్తు పెట్టుకోవాలి

## ప్రత్యామ్నాయ పరిష్కారం

ప్రత్యామ్నాయ పరిష్కారాలు లేవు